పేదల బియ్యం.. దళారుల భోజ్యం

- ఛావుని డివిజన్‌లో జోరుగా అక్రమ బియ్యం రవాణా
- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- తూతూ మంత్రంగా తనిఖీలు



చంచల్‌గూడ: పేదల సౌలభ్యం కోసం ప్రభుత్వాలు అందజేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. కార్డుదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి గోదాముల్లో నిల్వచేసి అధిక ధరలకు విక్రయించేందుకు రాష్ట్రాన్ని దాటిస్తున్నారు. సంబంధిత అధికారులకు పదుల సంఖ్యలో ఫిర్యాదులు వెళ్లినప్పుడు మాత్రమే తూతూ మంత్రంగా తనిఖీలు చేసి పొరపాటున ఎవరైన పట్టుబడితే కేవలం క్రిమినల్ కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కఠిన చర్యలు తీసుకుంటే తప్ప అక్కమార్కుల ఆగడాలు ఆగవని ప్రజలు పేర్కొంటున్నారు.

రూ. 10కి కొని రూ.25కు విక్రయం

లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్రమంగా నిల్వచేస్తూ బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న అక్రమార్కులకు క్రిమినల్ కేసులు సర్వసాధారణంగా మారాయి. ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని కార్డుదారుల, రేషన్ దుకాణాల యజమానుల నుంచి అధిక ధరలకు సేకరించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే బియ్యాన్ని రూ. 10కి కొనుగోలు చేసి రూ.15 ●25 వరకు అమ్ముకుంటున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలోని ఛావుని డివిజన్ అడ్డాగా మారిందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

అధికారుల నిఘా లేక..

కార్డుదారుల నుంచి చిల్లర వ్యాపారులు, బ్రోకర్లు కొనుగోలు చేసే వ్యాపారులు, టిఫిన్ సెంటర్ నిర్వాహకులు అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. మాదన్నపేట పీఎస్ పరిధిలోని ఛావుని, యాఖుత్‌పురా ప్రాంతాల్లో గోదాముల్లో రేషన్ బియ్యం నిల్వలు చేసి పోలీసులు, సివిల్ సప్లై శాఖ కళ్లుగప్పి బ్లాక్ మార్కెట్‌లకు తరలిస్తున్నారు. అధికారులకు సమాచారం అందినప్పుడు మాత్రమే గోదాముల్లో దాడులు జరుగుతున్నాయి తప్ప నిరంతర నిఘా కరువైందని స్పష్టమవుతోంది. డీసీఎంలు, ఆటోల్లో తరలిస్తుడంటంతో బహిర్గతమవుతుందని తాజాగా కొత్త పంథా అవలంభిస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకూడదని ద్విచక్ర వాహనాలపై తరలిస్తు సొమ్ము చేసుకుంన్నారు.

పీడీయాక్ట్‌తోనే అడ్డుకట్ట..

అక్రమార్కులపై పలుమార్లు క్రిమినల్ కేసులు నమోదవుతున్నా వారిలో ఎలాంటి భయం లేదు. మాదన్నపేట పీఎస్‌లో పరిధిలో పదులు సంఖ్యలో అక్రమ రేషన్ తరలింపు, నిల్వల గోదాములు ఉన్నాయి. రేషన్ అక్రమ బియ్యం దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతూ రూ. లక్షల్లో దోచుకుంటున్నారు. దీంతో అక్రమార్కులు క్రిమినల్ కేసులకు సైతం భయపడటం లేదు. అక్రమ గోదాములపై నిరంతర పోలీసు నిఘా లేకపోవడంతో రేషన్ బియ్యం దందా సాఫీగా సాగుతుంది. మాదన్నపేట పీఎస్‌లో పలువురు అక్రమార్కులపై నిత్యం కేసులు నమోదవుతున్నా వారిలో మార్పు కనిపించడం లేదు. రేషన్ అక్రమ దందా గ్యాంగ్‌లపై పీడీ యాక్ట్‌లు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వారం రోజుల్లోనే 11 మందిపై కేసులు నమోదైనట్లు సివిల్ సప్లై అధికారుల రికార్డుల ద్వారా తెలుస్తోంది.

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడాలి



ఇన్‌స్పెక్టర్ మురారి

చాదర్‌ఘాట్: నగరంలో నేడు జరిగే మిలాద్ ఉన్-నబి ర్యాలీని ప్రశాంతంగా నిర్వహించుకొని హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని కాపాడాలని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ మురారి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ర్యాలీలో డీజేలు పెట్టరాదని ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి అనుమతి లేదన్నారు. పోలీసులు నిర్దేశించిన ప్రాంతాలలోనే జరుపుకోవాలని ఇతర మతస్తుల నివాస ప్రాంతాలలో అనుమతి లేకుండా ర్యాలీలు తీయరాదన్నారు. బైక్‌పై స్టంట్స్ చేయకూడదని, భారీ హారన్స్ మోగించకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ భరత్ తదితరులు పాల్గొన్నారు.

రేపు తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

మలక్‌పేట: దివ్యాంగులకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15న తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి చేపడుతున్నట్లు వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) కోర్ కమిటీ వైస్ చైర్మన్, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి అందె రాంబాబు తెలిపారు. చంపాపేటలోని సైదాబాద్ మండల రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 11 గంటలకు చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు విస్మరించిందన్నారు.

రాహుల్‌కు బెస్ట్ ఆఫ్ ది ప్లేయర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న, రాహుల్ ముదావత్

మన్సూరాబాద్: అండర్–23 జాతీయ వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో ఢిల్లీ వర్సస్ రెస్టాఫ్ ఇండియా జట్లు ఫైనల్లో తలపడగా రెస్టాఫ్ ఇండియా జట్టు రన్నరప్‌గా నిలిచింది. రెస్టాఫ్ ఇండియా జట్టు సభ్యుడైన రాహుల్ ముదావత్ టోర్నమెంట్‌లో బెస్ట్ ఆఫ్ ది ప్లేయర్ అవార్డును అందుకున్నారు.

బీజేపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావటం ఖాయమని ఆ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని జామ్లానాయక్ ఆధ్వర్యంలో వివిధ కాలనీలలోని ఎస్టీ సంఘాల నాయకులు రాజ్‌కుమార్, సిద్దు, చరణ్, పవన్, కళ్యాణ్, శ్రీను శనివారం బీజేపీలోకి చేరగా వారికి సామ రంగారెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ.. నీతి, నిజాయితీ, నిబద్ధతతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌గౌడ్, రాజుగౌడ్, జీవన్‌రెడ్డి, వెంకటేష్, శశిధర్‌రెడ్డి, మునిల్‌నాయక్, మల్లేష్‌యాదవ్, శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అలరించిన 'ధ్రుపద్' సంగీతం

నాంపల్లి: ధ్రువపద్ గురుకులం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ ఆడిటోరియంలో 'వర్షోత్సవ్'శీర్షికన శాస్త్రీయ సంగీతంలో అత్యంత ప్రాచీనమైన 'ధ్రుపద్'శైలి పరిచయ కార్యక్రమం అలరించింది. ఈ సంగీత కార్యక్రమాన్ని ధ్రుపద్ గాయకులు, ధ్రుపద్ బంధు– సంజీవ్, మనీష్ హాజరై ప్రారంభించారు. సూరదాస్, తులసీదాస్, విద్యాపతి, ఆది శంకరాచార్యులు, కబీర్‌దాస్ వంటి కవులు రచించిన, ధ్రుపద్ శైలిలో స్వరపరచిన పలు కృతులను ప్రదర్శించారు. ముగింపులో భాగంగా పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత అశ్విని భిడే దేశ్‌పాండే ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.17, వంకాయ రూ.23, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.37, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.21, ఉల్లిగడ్డ రూ.14, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.15, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.50, చామగడ్డ రూ.23, మునగ రూ.75, కందగడ్డ రూ.40, బీట్‌రూట్ రూ.25, కీర రూ.18, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.55.

కృతజ్ఞత సభను విజయవంతం చేయాలి



చిట్టుపాక ప్రభాకర్‌మాదిగ

మలక్‌పేట: రవీంద్రభారతిలో ఈ నెల 22న నిర్వహించన్ను మాదిగల కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టుపాక ప్రభాకర్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలే అమలు చేసుకోవచ్చనే సుప్రీంకోర్టు తీర్పు అనంతరం మాదిగల ఆశ, ఆకాంక్షలను అనుగుణంగా సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ఎస్సీ వర్గీకరణ చట్టం చేసిందన్నారు. 30 ఏళ్ల మాదిగల కల సాకారం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేయడానికి కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదిగ రాజకీయ పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభకు మంత్రులు దామోదర రాజనర్సింహా, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం హాజరవుతారన్నారు.

నిపుణులైన అధ్యాపకులతో విద్యాబోధన



విద్యార్థినులకు పట్టా అందజేస్తున్న సుభాష్‌గౌడ్



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

చాదర్‌ఘాట్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసేందుకు నిపుణులైన అధ్యాపకులతో విద్యాబోధన అందిస్తున్నామని శ్రీవాణి మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, కార్యదర్శి సుభాష్‌గౌడ్ అన్నారు. శనివారం ఓల్డ్‌మలక్‌పేటలోని సిమ్లా గార్డెన్స్‌లో నిర్వహించిన కాన్వకేషన్ డే, ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాలలో విద్యార్థుల కోసం అత్యాధునిక సౌకర్యాలు కలిగిన ల్యాబ్‌తో పాటు లైబ్రరీ కూడా ఏర్పాటు చేశామన్నారు. విద్యాబోధనతో పాటు ఎథికల్ వ్యాల్యూస్‌ను కూడా పెంపొందిస్తున్నామని, విద్యార్థులు క్రమశిక్షణ పాటిస్తూ తరగతులకు హాజరవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విమలారెడ్డి, అధ్యాపకులు అనుప్రియ, గిరిధర్, జాన్, హమీదుల్లా ఖాన్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో.. 'యాత్రదానం'

డిపో మేనేజర్ లక్ష్మీసుధా

మహేశ్వరం: రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ(ఆర్టీసీ) ఆధ్వర్యంలో యాత్రదానం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మహేశ్వరం డిపో మేనేజ ర్ లక్ష్మీసుధ శనివారం ఒక ప్రకటనలో తెలిపా రు. సమాజంలో ఎందరో అనేకులకు అనేక రకాల దానాలు చేస్తుంటారని, అలాంటి వారు అనాథలు, నిరాశ్రయులు, దివ్యాంగులు, విద్యార్థులు, సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకునే పేద వారికి విజ్ఞాన విహార యా త్రలు, పర్యాటక ప్రాంతాలు, ప్రముఖ పుణ్యక్షేత్రాలు సందర్శించడానికి యాత్రదానం చేయా లని సూచించారు. ఇందులో భాగంగా వివిధ ప్యాకేజీలను సంస్థ రూపొందించిందన్నారు. యాత్రదానం చేయాలని అనుకునే వారు మహేశ్వరం డిపో 99522 26816 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సోషల్ వెల్ఫేర్ స్టాఫ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: కొత్తపేటలోని బీజేఆర్ భవనంలో శనివారం తెలంగాణ ఎస్సీ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ స్టాఫ్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. మొదటిసారిగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కోశాధికారి పదవులకు జరిగిన ఎన్నికలో రాష్ట్రం నలుమూలల నుంచి మినిస్టీరియల్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఎన్నికల్లో సోషల్ వెల్ఫేర్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉప్పు సత్యనారాయణ విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా అరవింద్‌కుమార్, కోశాధికారిగా జీవన్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా టీఎన్జీవో హైదరాబాద్ శాఖ అధ్యక్షులు కె.శ్రీకాంత్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా అసోసియేట్ ప్రెసిడెంట్ మెట్టు నాగిరెడ్డి వ్యవహరించగా, సహాయకులుగా భరత్ రాజు ఉన్నారు.

జలమయంగా రహదారులు

దిల్‌సుఖ్‌నగర్: రెండ్రోజులుగా కురిసిన వర్షానికి మలక్‌పేట్‌జోన్ పరిధిలోని పలు కాలనీలు జలమయంగా మారాయి. డ్రైనేజీలు పొంగడంతో రహదారులపై మురుగు ఏరులై పారుతోంది. దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట్, మున్సిపల్ కాలనీ, పద్మానగర్, కాలడేర, మలక్‌పేట్ రైల్వే బ్రిడ్జి, అజంపుర, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, ఐఎస్‌సదన్, మాదన్నపేట్ తదితర ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీలు జలమయంగా మారాయి. మలక్‌పేట్, నల్గొండ క్రాస్ రోడ్డు, మూసారాంబాగ్, మలక్‌పేట్, కొత్తపేట్, ఆర్‌కేపురం ప్రాంతాల్లో వర్షం కారణంగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాలు స్తంభించిపోయాయి.

క్రీడలకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్‌బీనగర్: కొత్తపేటలో శనివారం నిర్వహించిన తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యనిర్వాహక సంఘం, సాధారణ సభ్యుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడిగా రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడాల అభివృద్ధికిప్రాధాన్యం ఇస్తున్నారని అందుకోసం రాష్ట్రంలో స్పోర్ట్ యూనివర్సిటీని నిర్మిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడాశాఖతో కలిసి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. హ్యాండ్ బాల్ క్రీడలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు శిక్షణ, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకట్, తిరుమల్‌రెడ్డి, సాంబశివరావు, పవన్ కుమార్, రమేష్, రామలింగం, లక్ష్మం, ప్రభాకర్, సంజీవ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, విజయ్‌బాబు, మల్లేష్, పుల్లయ్య, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం



జిమ్‌ను ప్రారంభిస్తున్న పవన్‌కుమార్

నాగోలు: వ్యాయామం, యోగా, క్రీడలతో శరీరాన్ని ఆరోగ్యవంతంగా చేసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. డివిజన్ పరిధిలోని ప్రజయ్ నివాస్ ఫేస్–1లో అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత వేగవంతమైన జీవన శైలిలో ఆరోగ్యం, అత్యంత ముఖ్యమైందని దానిపై ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, రామారావు, లింగేశ్వర్, శివ, సురేష్, రమణ, సుందర్ నారాయణ, గట్టు మహేష్ కుమార్, సాయి పాటిల్ పాల్గొన్నారు.

స్పా సెంటర్లపై పోలీసుల దాడి

పలువురి అరెస్ట్

మలక్‌పేట: మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం స్పా సెంటర్లపై సౌత్‌ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ సైదాబాబు నేతృత్వంలో శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లోని ప్లాటీనం బ్యూటీ అండ్ వెల్‌నెస్ స్పాసెంటర్‌లో దాడి చేసి నిర్వాహకుడితో పాటు 9 మంది యువతులు, ఇద్దరు విటులను అరెస్ట్ చేశారు.

సన్మానం



నాగోలు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను శనివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా కుటుంబ సభ్యులతో కలిసి సన్మానించారు.

నూతన ఆలోచనలతో ముందుకెళ్లాలి



వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు

నాగోలు: నాగోలులోని కళ్యాణ లక్ష్మి గార్డెన్ హాల్లో శనివారం అవంతి డిగ్రీ, పీజీ విద్యాసంస్థల స్నాతకోత్సవ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అవంతి విద్యాసంస్థలు చదువుతో పాటు ఉద్యోగావకాశాల కల్పనకు కృషి చేస్తుందన్నారు. ప్రొఫెసర్ శశికాంత్ మాట్లాడుతూ.. టెక్నాలజీని ఉపయోగించుకొని కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలన్నారు. చైర్మన్, మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అవంతి విద్యాసంస్థలు భారత దేశంలోనే ఉన్నత స్థానంలో నిలిచాయన్నారు. త్వరలోనే అవంతి విశ్వవిద్యాలయాలుగా తీర్చిదిద్దుతామని దానికోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు పట్టా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలోప్రియాంక, లక్ష్మణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆప్కో కాలనీ సమస్యలకు త్వరలోనే పరిష్కారం

- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని ఆప్కో కాలనీలోని సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాలనీవాసుల వినతి మేరకు శనివారం ఆయన కాలనీలో పర్యటించారు. గతంలోఈ కాలనీకి దగ్గరగా శ్రీ విజయ దుర్గా ఎంక్లేవ్ గేటెడ్ కమ్యూనిటీగా ఏర్పడిందని తమ ఇళ్లల్లోకి పాములు ఇతర క్రిమీకీటకలు వస్తున్నాయని ఆప్కో కాలనీ దగ్గర గోడ నిర్మించారు. ఈ గోడతో చుట్టు పక్కల కాలనీవాసులకు సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ గోడను కూల్చితే దాదాపు 10 కాలనీవాసులకు సౌకర్యవంతంగా ఉంటుందని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ రోడ్డు గుండా ట్రంక్ లైన్ కూడా మంజూరైందని గుర్తు చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ట్రంక్ లైన్‌పై ఉన్న ఇంద్రప్రస్థ కాలనీ నుంచి రావడం జరుగుతుందని త్వరలోనే ఇక్కడ కూడా ట్రంక్ లైన్ పనులు ప్రారంభం అవుతాయన్నారు. ట్రంక్ లైన్ మూసీ వరకు కొనసాగుతుందని దారికి అడ్డుగా ఉన్న గోడను త్వరలోనే తీయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాజారెడ్డి, చిరంజీవి, రవి, అరవింద్ రెడ్డి, అంకారాజు, వెంకట్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

చైతన్యపురి: ఈ నెల 17న నిర్వహించే విశ్వకర్మ జయంతి వేడుకలకు రావాలని దిల్‌సుఖ్‌నగర్ విశ్వ బ్రాహ్మణ స్వర్ణకార సంఘం యజ్ఞ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో నరేష్‌చారి,శివ, అనంతాచారి, రవిచారి, చక్రి, అరుణ్ పాల్గొన్నారు.

బ్రోచర్ విడుదల



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఏసీపీ కాశీ రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురం సచివాలయనగర్‌లోని పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రతి ఏడాది శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి అన్నారు. శనివారం దేవాలయంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆలయ చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య, పాలకవర్గ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ లక్ష్మయ్య మాట్లాడుతూ.. ఈ నెల 24 నుంచి అక్టోబరు 3 వరకు శ్రీవారి బ్రహ్మోత్స వాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిత్యం ప్రత్యేక పూజలు, శ్రీవారి కల్యాణం, హోమాలు, తిరువీధి ఉత్సవం, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, శ్రీధర్, రామలక్ష్మి, సాంబశివరావు, సునీల్‌కుమార్‌గౌడ్, వెంకటేశ్వర్‌రావు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడాల్లోనూ రాణించాలి

నాగోలు: ఉప్పల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో నాగోలు జైపురికాలనీలోని సెయింట్ జాన్స్ హైస్కూల్ విద్యార్థులు బాలికల విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఉప్పల్ మండల ఎంఈఓ రామరావు, జోనల్ సెక్రటరీ పద్మావతి చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు.ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ సూరం రామ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మమతారెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి పాషా, వ్యాయామ ఉపాధ్యాయులు చొక్కయ్య, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



డ్రైనేజీలను శుభ్రం చేయిస్తున్న ఏఐసీసీ కో–ఆర్డినేటర్ రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ వినాయకహిల్స్ కాలనీలో గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిన డ్రైనేజీలు ప్రస్తుతం పొంగిపొర్లుతున్నాయి. కాలనీవాసుల విన్నపం మేరకు ఏఐసీసీ కో–ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి శనివారం గల్పర్ వాహనాన్ని తెప్పించి నిండిన డ్రైనేజీ లైన్లను శుభ్రం చేయించారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని కాలనీవాసులకు ఆయన హామీనిచ్చారు. డ్రైనేజీ సమస్యకు చెక్ పెట్టిన మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్, మాజీ మేయర్ చిగురింత పారిజాత, కమిషనర్ పి.సరస్వతి, డీఈఈ, ఏఈలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ 5వ డివిజన్ అధ్యక్షుడు ఏదుళ్ల ప్రతాప్‌రెడ్డి, నవారు యాదిరెడ్డి, అరవింద్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కాలనీవాసులు ఉన్నారు.

వీరుల చరిత్రను నేటి తరానికి తెలియజేయాలి

కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్



మాట్లాడుతున్న పాపయ్యగౌడ్

మీర్‌పేట: తెలంగాణ విమోచనం కోసం ప్రాణత్యాగం చేసిన వీరుల చరిత్రను నేటి తరానికి తెలియజేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్ పిలుపునిచ్చారు. విమోచన దినోత్సవం, ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా శనివారం మీర్‌పేటలో పార్టీ అధ్యక్షుడు భిక్షపతిచారి ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ వరకు చేపట్టనున్న సేవా పక్షం మున్సిపాలిటీ స్థాయి కార్యక్రమాల నిర్వహణ సమావేశానికి పాపయ్యగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు చేసిన పోరాటంతోనే తెలంగాణకు స్వేచ్ఛ లభించిందని తెలిపారు. సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. దీంతో పాటు ప్రతీ బూత్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని సూచించారు. ప్రధాని జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరాలు నిర్వహించి.. 75 మందితో రక్తదానం చేయించాలని చెప్పారు. సమావేశంలో నాయకులు తిరుపతిరెడ్డి, రవినాయక్, కరుణానిధి, రాజశేఖర్, కృష్ణారెడ్డి, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.